క్లుప్తంగా

నెమలి దేవస్థానం సహాయ కమిషనర్‌గా సాంబశివరావు



నెమలి(గంపలగూడెం): గంపలగూడెం మండలం నెమలి వేణుగోపాలస్వామి దేవస్థానం సహాయ కమిషనర్‌గా నూతక్కి సాంబశివరావు ఆదివారం బాధ్యతలు చేపట్టారు. మైలవరం మండలం బొర్రగూడెం దేవస్థానం ఈఓగా పనిచేసిన ఆయన పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు. కాగా ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన డి. శ్రీరామవరప్రసాదరావు ప్రమోషన్‌పై గుంటూరు జిల్లా పెదకాకాని మల్లేశ్వర స్వామి దేవస్థానానికి డెప్యూటీ కమిషనర్‌గా బదిలీ అయ్యారు.

14న వేంకటేశ్వరుని కల్యాణం

మునుకుళ్ల (తిరువూరురూరల్): మండలంలోని మునుకుళ్ల వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఈ నెల 14న స్వామి వారి కల్యాణ మహోత్సవం జరుగుతుందని ఆలయ కమిటీ తెలిపింది. సోమవారం నుంచి స్వామి వారి తిరు కల్యాణోత్సవాలు ప్రారంభమవుతాయని, 12న అంకురార్పణ, 13న ధ్వజారోహణ, 14న వృషభ విసర్జనం, రాత్రి 7 గంటలకు స్వామి వారి కల్యాణం, 15న ఊరేగింపు, అన్నదానం, 16న ధ్వజావరోహణ, పూర్ణాహుతి, చక్రస్నానం, పవళింపుసేవ కార్యక్రమాలు జరుగుతాయని వివరించారు.

మైలవరంలో 'పల్లెకు పోదాం'

మైలవరం: బీజేపీ ఆధ్వర్యంలో పల్లెకు పోదాం కార్యక్రమం మైలవరం దేవుడి చెరువులో ఆదివారం నిర్వహించారు. ఆ పార్టీ సీనియర్ నాయకుడు రేగళ్ల రఘునాథరెడ్డి కేంద్రం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. జన్‌ధన్ యోజన, ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డులు, ఉజ్వల భారత్ గ్యాస్ కనెక్షన్లు తదితర పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కరపత్రాలు పంపిణీ చేశారు. నాయకులు వెంకటేశ్వరరావు, కూనాల యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

హిందీ పరీక్షలకు 111 మంది హాజరు



తిరువూరు: దక్షిణ భారత హిందీ ప్రచార సభ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక సర్వోదయ యూపీ స్కూల్‌లో హిందీ పరీక్షలు జరిగాయి. ప్రాథమిక నుంచి ప్రవీణ వరకు జరిగిన పరీక్షల్లో తిరువూరు, విస్సన్నపేట, ఎ.కొండూరు, గంపలగూడెం మండలాల నుంచి 111 మంది విద్యార్థులు హాజరయ్యారు. పరీక్షలను హిందీ ప్రచారక్ రేపాక రఘునందన్, సెంటర్ సూపరింటెండెంట్ రమణమూర్తి పర్యవేక్షించారు.

15న అంకమ్మ తల్లి ఆలయ ప్రతిష్ఠ పూజలు

వేల్పుచర్ల (ముసునూరు): వేల్పుచర్లలో అంకమ్మ తల్లి నూతన ఆలయ ప్రతిష్ఠ కార్యక్రమం ఈ నెల 15న జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు. వేల్పుచర్ల పడమటి దళితవాడలో నూతనంగా నిర్మించిన అంకమ్మ తల్లి ఆలయం వద్ద అంకమ్మ దేవర ప్రతిష్ఠ కార్యక్రమాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తామన్నారు. అంకమ్మ తల్లికి పసుపు, కుంకుమ అలంకరణ, అంకమ్మ తల్లి పుట్టుగడ చరిత్ర (కథాగానం) తదితర కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

గంపలగూడెం: మండలంలోని ప్రధాన నీటి వనరైన కట్టలేరు పెద్దకొమిర రేవు నుంచి అనుమతి లేకుండా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను ఎస్‌ఐ ఎస్. శ్రీను ఆదివారం ఆకస్మికంగా దాడి చేసి పట్టుకున్నారు. ఈ ట్రాక్టర్‌ను తహసీల్దార్‌కు అప్పగించారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం



గొల్లపల్లిలో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు, ఎంపీపీ ఆరేపల్లి శిరీష



గొల్లపల్లిలో రూ.1.90 కోట్లతో నిర్మించిన మంచినీటి ట్యాంక్, పైప్‌లైన్ శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు

- ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు
- అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభం

నూజివీడు: గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. మండలంలోని గొల్లపల్లిలో ఉరక కాలువపై రూ.40 లక్షల వ్యయంతో వంతెన నిర్మాణానికి శంకుస్థాపన, రూ.5 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన, మండల పరిషత్ నిధులు రూ.15 లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్డును, జల్‌జీవన్ మిషన్ కింద రూ.1.90 కోట్లతో నూతనంగా నిర్మించిన రక్షిత మంచినీటి ట్యాంకును, పైప్‌లైన్లను ఆదివారం ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల సర్వతోముఖాభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. ప్రభుత్వ సేవలన్నీ గ్రామ స్థాయిలోనే అందుబాటులోకి తెచ్చేందుకే గ్రామ సచివాలయాల వ్యవస్థను, రైతు భరోసా కేంద్రాలను, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని చెప్పారు. అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ఎలాంటి అవినీతికి తావులేకుండా ప్రజల బ్యాంకు ఖాతాల్లోకి నేరుగా ప్రభుత్వ నిధులను ప్రభుత్వం జమ చేస్తోందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నింటినీ వందశాతం అమలు చేసిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని చెప్పారు. సంక్షేమ పథకాల అమలుకు క్యాలెండర్‌ను ప్రకటించి దాని ప్రకారం పథకాలను అమలు చేస్తున్న దమ్మున్న సీఎం జగన్ అని తెలిపారు. చంద్రబాబు ఏనాడూ ప్రజల సంక్షేమం కోసం ఆలోచన చేయలేదన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలంతా టీడీపీని ఓడించాలని కోరారు. సంక్షేమ పథకాల అమలు కోసం, అభివృద్ధి కొనసాగేందుకు వైఎస్ జగన్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని, ప్రజలందరూ వైఎస్సార్ సీపీకి అండగా నిలవాలని ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు కోరారు. అనంతరం ఉరక కాలువపై వంతెన నిర్మాణానికి రూ.40 లక్షలు మంజూరు చేయించి శంకుస్థాపన చేసినందుకు ఎమ్మెల్యే ప్రతాప్‌ను గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ గుడిమళ్ల కృష్ణంరాజు, ఎంపీపీ ఆరేపల్లి శిరీష, సర్పంచి బొకినాల వెంకటేశ్వరమ్మ, ఎంపీటీసీలు తటకలూరి రామయ్య, చల్లారి రేణుక ధనలక్ష్మి, మాజీ సర్పంచి ఎస్‌టీపీ వెంకటేశ్వర్లు, వైస్ సర్పంచి మేరుగ లెనిన్, వైఎస్సార్ సీపీ నాయకులు చల్లారి రాఘవ, తటకలూరి రంగారావు, చల్లారి వెంకటరామయ్య పాల్గొన్నారు.

సర్పంచ్ కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ



నితిన్ భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మేకా వెంకటప్రతాప్ అప్పారావు

నూజివీడు: జంగంగూడెంకు చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు పొట్లూరి అశోక్, సర్పంచి అంజనీకుమారి కుమారుడు పొట్లూరి నితిన్ (22) మృతి చెందడంతో భౌతిక కాయాన్ని ఆదివారం ఎమ్మెల్యే మేకా వెంకటప్రతాప్ అప్పారావు సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. మృతుడి తల్లిదండ్రులను పరామర్శించి సానుభూతి తెలిపారు. కష్టకాలంలోనే ధైర్యంగా ఉండాలని చెప్పారు. జెడ్పీ వైస్ చైర్మన్ గుడిమళ్ల కృష్ణంరాజు, ఎంపీపీ ఆరేపల్లి శిరీష, వైఎస్సార్ సీపీ నూజివీడు పట్టణ అధ్యక్షుడు శీలం రాము, విద్యా మౌలిక సదుపాయాల సంస్థ రాష్ట్ర డైరెక్టర్ కలగర వెంకటేశ్వరరావు, మండలంలోని వైఎస్సార్ సీపీ నాయకులు, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు నితిన్ భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

హనుమద్ వాహనంపై శోభనాచలుడి దర్శనం



హనుమద్ వాహనంపై శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీనరసింహస్వామి

ఆగిరిపల్లి: శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీ నరసింహస్వామి మాఘమాస రథ సప్తమి ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు ఆదివారం స్వామి వారు హనుమద్ వాహనంపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం 10 గంటలకు లక్ష్మీనరసింహ జ్యూయలరీ మార్ట్ ఆధ్వర్యంలో కల్యాణ పూజలు నిర్వహించారు. రాత్రి ఏడు గంటలకు గ్రామ గౌడ సంఘం ఆధ్వర్యంలో స్వామి వారిని పెళ్లి కుమారుడిగా అలంకరించి హనుమంతు వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం స్వామివారి కల్యాణ మండపంలో నిత్య కల్యాణం ఆలయ అర్చకులు వేదాంతం శేషుబాబు, జి.అనంత కృష్ణ, వేద పండితుల ఆధ్వర్యంలో వైభవంగా జరిపించారు. కార్యక్రమాలను ఆలయ ఈఓ సీతారామయ్య పర్యవేక్షించారు. స్వామివారి మండపాన్ని దాతల సహకారంతో విద్యుత్ దీపాలతో అలంకరించారు.

పేదలకు లయన్స్ క్లబ్ చేయూత



పేదలకు సరుకులు పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

కంచికచర్ల : లయన్స్ క్లబ్ ద్వారా పేదలకు చేయూతనందిస్తున్నట్లు లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ డిస్ట్రిక్ గవర్నర్ శంకరగుప్తా తెలిపారు. స్థానిక పుల్లగూర ప్రభాకరరావు ఆసుపత్రి ఆవరణలో సోమవారం 100 మంది వరదబాధితులు, పేదలకు లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఫండ్ ద్వారా ఒక్కొక్కరికి రూ.1200 విలువగల నూతన వస్త్రాలు, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శంకరగుప్తా మాట్లాడుతూ లయన్ క్లబ్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తునట్లు తెలిపారు. కరోనా సమయంలో పేదలకు నిత్యం భోజన వసతి కల్పించామని చెప్పారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ క్యాబినేట్ సెక్రటరీ చక్రధర్, డిస్ట్రిక్ ట్రెజరర్ రామారావు, ఎల్‌సీఐఎఫ్ కో–ఆర్డినేటర్ డాక్టర్ పుల్లగూర ప్రభాకరరావు, వెంకటప్పయ్య, కోనేటి శ్రీనివాసరావు, నన్నపనేని నరసింహారావు, దేవిరెడ్డి శేఖర్, సూదుల సోమశేఖర్ , పుల్లగూర బాలాజీ, నన్నపనేని నరసింహారావు, దొడ్డా జయనరసింహారావు, కొండా వెంకటకృష్ణారావు పాల్గొన్నారు.

నేడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో స్పందన

నూజివీడు: పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తామని ఆర్డీఓ వై. భవానీ శంకరి ఆదివారం తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి కార్యాలయంలో డివిజన్‌లోని ప్రజల నుంచి వారి సమస్యలపై అర్జీలను స్వీకరించి, వాటిని గడువులోగా పరిష్కరిస్తామన్నారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్పందనలో ప్రజలు అర్జీలను అందజేయవచ్చని చెప్పారు.

గంపలగూడెంలో..

గంపలగూడెం: గంపలగూడెం తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు స్పందన కార్యక్రమం జరుగుతుందని తహసీల్దార్ సుగుణ తెలిపారు. మండల పరిధిలోని అన్నిశాఖల అధికారులు తప్పక హాజరుకావాలన్నారు. ప్రజలు తమ సమస్యలపై అధికారులకు అర్జీలు అందజేయవచ్చన్నారు.

వ్యాయామ ఉపాధ్యాయిని సుమలత మృతి



ఆగిరిపల్లి: మండలంలోని ఎం. సురవరం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో వ్యాయామ ఉపాధ్యాయినిగా పనిచేస్తున్న సుమలత అనారోగ్యంతో ఆదివారం ఉదయం నున్న గ్రామంలో వారి స్వగృహంలో మృతిచెందారు. ఎంఈఓ కొవ్వలి ఆనంద్ కుమార్, పలువురు ఉపాధ్యాయులు ఆమెకు నివాళులర్పించారు.

ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్



విస్సన్నపేట: పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించరాదని, ఎక్కువమందితో ప్రయాణం చేయడం ప్రమాదమని ఇన్‌చార్జి ఎస్‌ఐ జీవీవీ సత్యనారాయణ అన్నారు. అధిక లోడుతో వెళ్తున్న ఆటోలను, ద్విచక్ర వాహనాలను ఆదివారం తనిఖీలు చేశారు. అధిక లోడుతో వెళ్తున్న ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ప్రమాదాలు జరుగకుండా పరిమితికి మించకుండా ప్రయాణికులను ఎక్కించుకోవాలని ఎస్‌ఐ చెప్పారు. ద్విచక్ర వాహనాలపై ట్రిపుల్ రైడింగ్ చేయరాదని, లైసెన్సు లేకుండా వాహనాలు నడపరాదన్నారు. ఈ సందర్భంగా నూజివీడు రోడ్డులో ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో బోర్డులను ఏర్పాటు చేశారు.

వైభవంగా వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవం



పెనుగొలనులో వాసవీమాత పల్లకీ ఉత్సవం

గంపలగూడెం: ఆర్యవైశ్యుల ఇలవేల్పు వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని గంపలగూడెం మండలంలోని పలు గ్రామాల్లో ఆర్య వైశ్య సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. గంపలగూడెం శివాలయంలో అర్చకుడు బాదంపూడి రామలింగప్రసాద్‌చే వాసవీమాతకు పంచామృతాలతో అభిషేకం చేసి ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం మహిళలచే అమ్మవారికి సామూహిక కుంకుమార్చన, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించారు. పెనుగొలనులో అమ్మవారికి పల్లకీ సేవ, సామూహిక కుంకుమార్చన, దీపోత్సవం జరిపారు. గోసవీడు విశ్వేశ్వర స్వామి ఆలయంలో సహస్ర నామార్చన, అభిషేకం, కుంకుమార్చన చేశారు. ఆర్య వైశ్య సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నాళ్ళా చిన్నసత్యంబాబు, మండల సంఘం అధ్యక్షుడు వేములపల్లి రామకృష్ణ, మాజీ అధ్యక్షుడు కోట నాగేశ్వరరావు, మహిళా విభాగం అధ్యక్షురాలు వనమా సుజాత పాల్గొన్నారు.

విహారయాత్రలతో విజ్ఞానం పెంపు



విహారయాత్రకు బయలుదేరిన విద్యార్థులు

మైలవరం: విహార యాత్రలతో విద్యార్థుల్లో విజ్ఞానం పెరుగుతుందని ప్రిన్సిపాల్ ఇళ్ల రవి అన్నారు. లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఆదివారం విహారయాత్రకు తరలివెళ్లారు. యాత్ర బస్సును ప్రిన్సిపాల్ రవి ప్రారంభించారు. కృష్ణా జిల్లాలోని ఘంటసాల బౌద్ధక్షేత్రం, చల్లపల్లి కోట, శ్రీకాకుళంలో శాతవాహనుల కాలం నాటి పురాతన మహావిష్ణు ఆలయం, భారతీయ పురావస్తు శాఖ మ్యూజియం తదితర చారిత్రాత్మక ప్రదేశాలను సందర్శించారు. విజయనగర రాజు శ్రీకృష్ణదేవరాయులు కళింగుల దండయాత్ర కాలం నాటి శాసనాలను పరిశీలించారు. వివిధ దాడుల్లో క్షీణించిన మహావిష్ణు ఆలయానికి చల్లపల్లి సంస్థాన రాజులు చేపట్టిన మరమ్మతుల వివరాలను చరిత్ర విభాగం అధ్యాపకులు శ్రీనివాసరావు ద్వారా తెలుసుకున్నారు.

విద్యతోనే ఉన్నత భవిష్యత్

తక్షశిల ఐఏఎస్ అకాడమీ ఎండీ దుర్గాప్రసాద్



రామాయణం నృత్య రూపకాన్ని ప్రదర్శిస్తున్న విద్యార్థులు

భవానీపురం(విజయవాడ పశ్చిమ): విద్య అనే ఆయుధం భవిష్యత్‌లో ఎదుగుదలకు ఎంతగానో దోహదం చేస్తుందని, అటువంటి ఆయుధాన్ని విద్యార్థులకు అందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని తక్షశిల ఐఏఎస్ అకాడమీ మేనేజింగ్ డైరెక్టర్ బీఎస్‌ఎన్ దుర్గాప్రసాద్ అన్నారు. రవీంద్ర భారతి నెక్స్‌జెన్ సీబీఎస్‌ఈ స్కూల్ (గొల్లపూడి) నిర్వహించిన వార్షికోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు చదువు చెప్పడంతోపాటు అన్ని కళల్లోనూ ముందుండేలా ప్రోత్సహిస్తూ వారి భవిష్యత్‌ను తీర్చిదిద్దుతున్న స్కూల్ యాజమాన్యాన్ని ప్రశంసించారు. జీవితానికి ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని దానిని సాధించేందుకు క్రమశిక్షణ, పట్టుదల అవసరమని చెప్పారు. ఎంతో శ్రమించి ఐఏఎస్, ఐపీఎస్ అధికారులైన వారిని స్ఫూర్తిగా తీసుకుని అడుగులు ముందుకు వేయాలని సూచించారు. స్కూల్ చైర్మన్ వీరమాచనేని వంశీకృష్ణ మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి జీవితంపై ఎన్నో ఆశలు, కలలు ఉంటాయని, అవి నెరవేరేందుకు విద్య ఒక్కటే సాధనమన్నారు. స్కూల్ అకడమిక్ డైరెక్టర్ వీరమాచనేని శాంతి మాట్లాడుతూ ప్రతి విద్యార్థిలోనూ ఏదో ఒక కళ అంతర్లీనంగా దాగి ఉంటుందని, దానిని గుర్తించి వెలికితీయడమే తమ విద్యా సంస్థల ధ్యేయమని చెప్పారు. స్కూల్ ప్రిన్సిపాల్ సరిత మాట్లాడుతూ ప్రతి విద్యార్థిని వ్యక్తిగతంగా పర్యవేక్షిస్తూ వారికి సులువుగా అర్థమయ్యేలా విద్యా బోధన ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. ముఖ్యంగా రామాయణం నృత్య రూపకం విశేషంగా ఆకట్టుకుంది. ఈ ఏడాది విద్యా సంవత్సరంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందచేశారు. స్కూల్ జనరల్ మేనేజర్ రాజేష్, జోనల్ హెడ్స్ సరళాదేవి, రమేష్, వైస్ ప్రిన్సిపాల్స్ మోనిక, సరిత, సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యం



తిరుపతిరావును సత్కరించిన సర్పంచి మంజుభార్గవి

మైలవరం: నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని వైఎస్సార్ సీపీ మైలవరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ సర్నాల తిరుపతిరావు యాదవ్ అన్నారు. మైలవరం సర్పంచి గరికపాటి మంజుభార్గవిని ఆదివారం ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయం మేరకు రానున్న ఎన్నికల్లో పార్టీ విజయం కోసం అహర్నిశలు కష్టపడదామని చెప్పారు. ఈ సందర్భంగా తిరుపతిరావును ఆమె శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఘంటసాలకు కళాకారుల నివాళి

చెక్కపల్లి (ముసునూరు): మధుర గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు సదా స్మరణీయుడని పలువురు కళాకారులు అన్నారు. స్థానిక చెక్కపల్లి సెంటర్‌లో మండల పౌరాణిక నాటక కళాకారుల సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు కూసం మార్కండేయులు, బొల్లిన నాగరాజు ఆధ్వర్యంలో ఆదివారం దివంగత సినీ నేపథ్య గాయకుడు ఘంటసాల వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. అభిమానులు, పలువురు పౌరాణిక నాటక కళాకారులు ఘంటసాల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కళాకారులు స్వర నివాళి అర్పించారు.

కొనసాగిన ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్లు

విజయవాడరూరల్: విజయవాడ రూరల్ మండలంలో 4,019 మంది ఇళ్ల స్థలాలకు రిజిస్ట్రేషన్లు జరిగాయని తహసీల్దార్ పి. జాహ్నవి తెలిపారు. మండలంలోని అన్ని సచివాలయాల్లో ఆదివారం ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్లు జరిగాయన్నారు.

ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తా

మాజీ ఎమ్మెల్యే చిన్నం రామకోటయ్య

చాట్రాయి: ఏలూరు జిల్లాలోని నూజివీడు నియోజకవర్గం నుంచి వచ్చే ఎన్నికల్లో తాను స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని మాజీ ఎమ్మెల్యే చిన్నం రామకోటయ్య తెలిపారు. ఆదివారం ఏలూరు జిల్లా చాట్రాయిలో నిర్వహించిన ప్రజాసభలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు. గతంలో ఆయన నూజివీడు నియోజకవర్గం నుంచి టీడీపీ తరపున పోటీచేసి విజయం సాధించారు.













భక్త జనసంద్రం.. మేరీమాత పుణ్యక్షేత్రం

గత మూడు రోజులుగా జరుగుతున్న మేరీమాత శతాబ్ది ఉత్సవాలు ఆదివారంతో వైభవంగా ముగిశాయి. విదేశాలతో పాటు దేశంలోని అనేక రాష్ట్రాల నుంచి లక్షలాది మంది క్రీస్తు విశ్వాసులు పుణ్యక్షేత్రానికి తరలివచ్చారు. దీంతో గుణదల కొండ భక్తజనసంద్రమైంది. ఫాదర్లు నిర్వహించిన సమష్టి దివ్యబలి పూజ కార్యక్రమంలో భక్తులు పాల్గొని దైవ సందేశాన్ని ఆలకించారు. దివ్య సత్ప్రసాదాన్ని స్వీకరించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పుణ్యక్షేత్ర ప్రధానాలయంలో మరియతల్లి స్వరూపాన్ని భక్తులు దర్శించుకున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

పుల్లల వ్యాపారి అదృశ్యం

ఆగిరిపల్లి: మండలంలోని వడ్లమానుకు చెందిన జల సూత్రం రంగారావు కనిపించడం లేదని అతని భార్య రమాదేవి ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ సురేంద్ర కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. రంగారావు పుల్లల వ్యాపారం చేస్తుంటాడు. ఈ నెల 5న చింతలపూడిలో పుల్లలు విక్రయించిన సొమ్ము కోసం వెళ్తున్నానని రంగారావు తన భార్యకు చెప్పి ద్విచక్ర వాహనంపై వెళ్లాడు. భార్య రమాదేవి అదే రోజు సాయంత్రం రంగారావుకు ఫోన్ చేయగా డబ్బు ఇవ్వాల్సిన వ్యక్తి హైదరాబాద్ నుంచి వస్తున్నాడని, అతని నుంచి డబ్బు తీసుకుని మరుసటి రోజు వస్తానని సమాధానమిచ్చాడు. 6వ తేదీన రంగారావుకు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ అని రావడంతో అతని భార్య ఆందోళన చెంది పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.